ఇలా చేస్తే.. జర్నీ సేఫ్


దిగువ రోటరీలో ప్రయాణిస్తున్న వాహనాలు

- వాహనాలన్నీ రోటరీ విధానం పాటించాలి
- భారీ వెహికల్స్‌కు ఎగువ బ్రిడ్జి
- కార్లు ఆటోలు, ద్విచక్రవాహనాలకు దిగువ రోటరీ
- పాదచారుల కోసం మధ్య రోటరీ
- సురక్షిత ప్రయాణం కోసం నిబంధనలు పాటించాలంటున్న ట్రాఫిక్ పోలీసులు

గోపాలపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎక్కువగా తాకిడి ఉన్న ప్రాంతం ఎన్ఏడీ జంక్షన్. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చేవారు 80 శాతం మంది ఎన్ఏడీ పైనుంచే వస్తుంటారు. అనకాపల్లి, నర్సీపట్నం, కొత్తవలస, అరకు వంటి పలు ప్రాంతాల వారికి ఇదే ప్రధాన రహదారి. ఇక్కడి రద్దీ సమస్య, ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ పోలీసులు ఎన్ఏడీ ఫ్లైఓవర్‌కు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా రోటరీ విధానంలో భారీ వాహనాలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, పాదచారుల కోసం రోడ్లను విభజించారు. ఆ ప్రకారం ప్రయాణాలు సాగిస్తే అందరికీ సురక్షితం.

బ్రిడ్జి నిర్మాణంతో ప్రయోజనాలు..

ఈ బ్రిడ్జి నిర్మాణం ప్రత్యేకంగా ఉంటుంది. నాలుగు రోడ్లలో వాహనాలు ఇబ్బంది లేకుండా సాగిపోయే విధంగా నిర్మాణం చేపట్టారు. వాహన చోదకులు ట్రాఫిక్ రూల్స్, క్రమశిక్షణ పాటిస్తే చాలు ప్రమాదరహితంగా సాగిపోవచ్చని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు.

ఎగువ రోటరీలో..

ఎగువ రోటరీ బ్రిడ్జి భారీ వాహనాలైన లారీలు, బస్సులు, వ్యాన్లకు కేటాయించారు. ఈ దారి గుండా ఆటోలు, ద్విచక్రవాహనాలు వెళ్లరాదు. అలా వెళ్లినట్లయితే జరిమానాలు పడతాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఎగువ రోడ్డులో 30 కిలోమీటర్ల వేగంతో మాత్రమే ప్రయాణించాలి.


ఎన్ఏడీ ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ ఎగువ రోటరీ


నిత్యం పహారా కాస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మధ్య రోటరీ

మధ్య రోటరీ ప్రత్యేకంగా పాదచారులకు మాత్రమే నిర్మించారు. నాలుగు రోడ్లను కలుపుతూ ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించారు. వీటి ద్వారా పాదచారులు వారి గమ్యాలకు చేరుకోవచ్చు.

దిగువ రోటరీ


పాదచారులకోసం పచ్చని మొక్కలతో ఏర్పాటు చేసిన మధ్య రోటరీ

ఇది గ్రౌండ్ లెవల్ రోడ్డు. ఈ రోడ్డులో ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు ప్రయాణించాలి. ఈ రోడ్డులో 20 కిలోమీటర్ల గరిష్ట వేగంతో ప్రయాణించాలి. దిగువ రోడ్డులో ఏ వాహనం నిలుపరాదు. అలా నిలిపినట్లయితే అపరాధ రుసుముకు బాధ్యులవుతారు. ఈ రోడ్డులో ఆటోలు నిలపకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాల్సి ఉందని ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు. ఇలా నిలిపేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు.

హైట్ బారియర్స్ వేయాలి

భారీ వాహనాలు దిగువ రోడ్డులోకి రాకుండా హైట్ బారియర్స్ వేయాలని ప్రజలు కోరుతున్నారు. గోపాలపట్నం నుంచి ఎన్ఏడీ వచ్చే రోడ్డు.. మర్రిపాలెం నుంచి వచ్చే రోడ్డు.. నగరం నుంచి వచ్చే జాతీయ రహదారిలో హైట్ బారియర్స్ లేకపోవడం వల్ల ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భారీ వాహనాలు, టూరిస్ట్ బస్సులు దిగువ రోటరీ వరకు వచ్చి ఇరుక్కుంటున్నాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ట్రాఫిక్ అధికారులు ఇలాంటి లోపాలను సరిదిద్దాలని కోరుతున్నారు.

ఎన్ఏడీ బ్రిడ్జిని సుందరీకరించాలి

ఎంతో ఖర్చు చేసి నిర్మించిన బ్రిడ్జిని కళావిహీనంగా వదిలేశారు. బ్రిడ్జి గోడలు.. స్తంభాలను సాంప్రదాయ బొమ్మలతో సుందరీకరించాలని కోరుతున్నారు. కొందరు ఈ గోడలు, స్తంభాలపై పోస్టర్లు అతికించి ఛిద్రం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

వరప్రసాద్‌కు ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డు



కంచరపాలెం: మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సోషియల్ పాయింట్ ఫౌండేషన్ సంస్థ ప్రతిష్టాత్మకమైన ప్రైడ్ ఆఫ్ ఇండియా జాతీయ అవార్డును నగరానికి చెందిన చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా కన్వీనర్, సామాజిక కార్యకర్త మాముడూరి వరప్రసాద్ అందుకున్నారు. సంస్థ చైర్మన్ అభిషేక్ దెంబ్ల, ఫౌండర్ అమిత్ ప్రజాపతి చేతులు మీదుగా అవార్డు అందుకున్నట్లు వరప్రసాద్ తెలిపారు. దీంతో వరప్రసాద్‌కు హ్యూమన్ రైట్స్ సభ్యులు అభినందనలు తెలిపారు.

నేడు వేటూరి చిత్రగీతాల విభావరి

దాబాగార్డెన్స్ : ప్రముఖ సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి 88వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 29న వేటూరి చిత్రగీతాలతో ఝుమ్మంది నాదం.. శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు ఆత్రేయ స్మారక కళా పీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళి ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్న సంగీత విభావరిలో ప్రముఖ గాయకులు కెజ రాజేంద్రప్రసాద్, రమేష్ పట్నాయక్, ఫణిభూషణ్, శంబర జోగారావు, పీఎల్ నాయుడు, ఎంవీఆర్ నాగేశ్వర రావు, సరాగ మాలికకుమారి, కల్యాణి, శృతి, శ్రీకృతి, శైలజ, జ్యోత్స్న, దీప్తి గీతాలు ఆలపిస్తారన్నారు.

క్లుప్తంగా

మంత్రి అంబటికి ఘన స్వాగతం


విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న మంత్రి అంబటి రాంబాబు

గోపాలపట్నం: నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు శనివారం సాయంత్రం విశాఖ చేరుకున్నారు. ఆయనకు పార్టీ నాయకులు సాదర స్వాగతం పలికారు. నగరంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చారు. విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన నగరంలోకి వెళ్లారు.

సూర్య నమస్కారాలతో ఆరోగ్యం


క్రీడా మైదానంలో సూర్య నమస్కారాలు చేస్తున్న యువత

మల్కాపురం: రథసప్తమి సందర్భంగా ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 60వ వార్డు గుల్లలపాలెంలోని క్రీడామైదానంలో శనివారం సూర్య నమస్కారాలు చేశారు. ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు యువతకు సూర్య నమస్కారాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సూర్యుడి వెలుగు మానవ శరీరానికి తగలడం వల్ల మనిషి ఆరోగ్యంగా ఉంటాడని చెప్పారు. సృష్టిలో ప్రతి ప్రాణికీ సూర్యుడి వెలుగు ఎంతో శ్రేయస్కరం అన్నారు. అనంతరం యోగ ప్రక్రియలో సూర్య నమస్కారాల ప్రాధాన్యతను వివరించారు.

ఘనంగా రథసప్తమి పూజలు


సూర్యభగవానుడికి పూజలు చేస్తున్న అర్చకుడు

కంచరపాలెం: స్థానిక తిక్కవానిపాలెం అన్నపూర్ణ విశ్వేశ్వర సూర్యభగవాన్ ఆలయంలో శనివారం రథసప్తమి పురస్కరించుకుని ప్రధాన అర్చకుడు ఏలూరు రామకృష్ణ శర్మ సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తరించారు. ఆలయ ఆవరణలో భక్తులు సూర్య రథాన్ని పూలతో అలంకరించి ప్రసాదాలు సమర్పించారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, ఆలయ చైర్మన్ గంటా కామరాజు, ఆలయ కమిటీ సభ్యులు పట్టిమి రాజు, కొనాడ రాము ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉత్సాహంగా కరాటే పోటీలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హీరో సుమన్ తదితరులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెం పాఠశాల మైదానంలో శనివారం నిర్వహించిన ఫ్రెండ్లీ కరాటే పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీలను సినీ హీరో సుమన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేటి యువత ఎంచుకున్న రంగంలో రాణించి పుట్టిన ఊరికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చే విధంగా ఉండాలన్నారు. కరాటే ఆత్మరక్షణకే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు పి.వి.సురేష్, వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, టీడీపీ నాయకుడు కోరాడ శ్రీను,జనసేన నాయకురాలు అంగ దుర్గాప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌కుమార్‌కు పలువురు అభినందనలు


ఆనంద్‌కుమార్‌ను అభినందిస్తున్న పుర్రె సురేష్‌యాదవ్ తదితరులు

మల్కాపురం : వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ విశాఖ డెయిరీ చైర్మన్‌గా ఎన్నిక కావటంతో ఆయనను పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పార్టీ నాయకులు అభినందించారు. ఆనంద్‌కుమార్ కార్యాలయం వద్ద శనివారం ఉదయం ఆయనను 59వ వార్డు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, స్టూడెంట్ ఇన్‌చార్జి సంపత్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు శాన్, ఖాశీశా, లొపెంటి వెంకటరమణ తదితరులు శాలువ కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. అలాగే పార్టీ రాష్ట్ర నాయకులు అంగ రామ్‌ప్రసాద్, ఎస్సీ, ఎస్టీ సెల్ మోనిటరింగ్ సభ్యులు పూండి మల్లేశ్వర రావు తదితరులు ఆయనను అభినందించారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం

మల్కాపురం : 61వ వార్డు మల్కాపురం, నగరాల వీధి వద్ద శనివారం సాయంత్రం శ్రీనివాసుని కల్యాణ మహోత్సవాన్ని ప్రముఖ కాంట్రాక్టర్ మజ్జి సోమేష్ నిర్వహించారు. రథసప్తమి సందర్భంగా ఆయన పలువురు వేంకటేశ్వరస్వామి భక్తులతో కలిసి పెద్ద సెట్ ఏర్పాటు చేశారు. అందులో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని నెలకొల్పి కనులపండువగా కల్యాణం జరిపించారు. అంతకు ముందు స్వామివారిని ముత్యాల పల్లకిలో పురవీధుల్లో అంగ రంగ వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ముందు సేవ గరిడి, కోలాట ప్రదర్శన చేశారు. అనంతరం స్వామి వారి కల్యాణం జరిపించారు. స్థానికంగా గల పలువురు జంటలు పాల్గొని స్వామి వారి కల్యాణం పూజలు జరిపారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు పెద్దలు, పలు కుల సంఘాల ప్రతినిధులు పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని కనులారా తిలకించారు.


ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వేంకటేశ్వరస్వామి విగ్రహం


శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

వైభవంగా అప్పన్న కల్యాణం

సింహాచలం: రథ సప్తమి పురస్కరించుకుని శనివారం సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని రాతిరథంపై స్వామివారి నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఏడాదిలో రథ సప్తమి రోజు మాత్రమే రాతిరథంపై స్వామివారి నిత్యకల్యాణం నిర్వహించడం పరిపాటి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను విశేషంగా అలంకరించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ,సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు చక్రవర్తి, అప్పాజీ తదితరులు కల్యాణం నిర్వహించారు. రథంపై స్వామివారి కల్యాణం తిలకించి ఉభయదాతలు, భక్తులు పరవశించారు.


జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

అలరించిన పీబీ శ్రీనివాస్ గానలహరి

అల్లిపురం: ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు పీబీ శ్రీనివాస్ స్మారకార్థం ఎంటీఆర్ సినీ సాంగ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పీబీ శ్రీనివాస్ గానలహరి ఆహుతులను అలరించింది. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం సాయంత్రం నిర్వహించిన సినీ సంగీత విభావరిలో సంస్థ అధ్యక్షుడు ఎం.త్రినాథరావు, మహ్మద్ ఖాన్, లాయర్ శ్రీదేవి, ఎంవీఆర్ నాగేశ్వరరావు, లక్ష్మీ సాత్విక్, కందర్ప రాధ, ఎస్ఎస్ఎన్ రాజు, లక్ష్మణ్, లయ, శశికళ, నాగలక్ష్మి పాడిన గీతాలు ప్రేక్షకుల ప్రశంసలు పొందాయి. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ న్యాయవాది ఉప్పలపాటి జానకీదేవి, ప్రకాష్ దంపతులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో గంటి మురళి, కొణతాల రాజు, చెన్నా తిరుమలరావు, మెలోడి సత్యనారాయణ, జీఎంఆర్ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.


ఉప్పలపాటి జానకీదేవి, ప్రకాష్ దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

దేశానికి సేవ చేయండి

మురళీనగర్: దేశం కోసం మనం ఏమి చేయగలమని విద్యార్థులు ఆలోచించాలని రిటైర్డ్ వైస్ అడ్మిరల్ రమన్ పూరి అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రిన్సిపాల్ జీవీ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు నిర్వహించిన చైతన్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే దేశంపై ప్రేమ, త్యాగం అనే ముఖ్యమైన గుణాలను అలవరచుకోవాలని సూచించారు. ప్రపంచంలోనే భారతీయులు అత్యంత మేధోశక్తి గలవారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆత్మనిర్భర్ భారత్‌లో పాల్గొని దేశానికి సేవ చేయాలని రమన్ పూరి పిలుపునిచ్చారు. విద్యార్థులు ఉత్తమ జీవనానికి నిర్ణయాలు తీసుకోవడంలో చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో 800 మంది విద్యార్థులు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రిటైర్డ్ వైస్ అడ్మిరల్ రమన్ పూరి


ఆధ్యాత్మికం

కలియుగ వెంకన్నకు పంచామృతాభిషేకాలు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి ,సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్నకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రిన్సిపల్ సెక్రటరీ విజయ్‌కుమార్


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న విజయ్‌కుమార్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ జి.విజయ్‌కుమార్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

స్పెషల్ డ్రైవ్‌లో 73 కేసుల నమోదు

- ఒక వాహనం సీజ్


తనిఖీలు నిర్వహిస్తున్న రవాణాశాఖ అధికారులు

గోపాలపట్నం: ఫ్యాన్సీనంబర్లపై రవాణా శాఖ అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 73 కేసులు నమోదు చేశారు. ఒక వాహనాన్ని సీజ్ చేశారు. ప్రత్యేక బృందాలు బోయపాలెం, ఎస్ఎస్‌టీఎల్, మద్దిలపాలెం, గాజువాక, ప్రాంతాల్లో తనిఖీలు చేశాయి. నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీలు కొనసాగుతాయని ఉరవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు.

అవార్డులు బాధ్యతను పెంచుతాయి

మల్కాపురం : మల్కాపురం శాఖా గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ అంకితభావంతో విధులు నిర్వర్తించడంతో అతనికి రిపబ్లిక్ డే రోజున కలక్టర్ మల్లికార్జున్ ప్రశంసాపత్రాన్ని అందించారు. దీంతో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు కవులు, రచయితలు, చిత్రకారులు, సామాజిక సేవా కార్యకర్తలు ఆయనను ఘనంగా సత్కరించారు. గ్రంథాలయం వద్ద శనివారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది జీకేవీ రాజు అతిథిగా పాల్గొని గ్రంథాలయాదికారి అజేయ్‌కు శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ అజేయ్ తన వృత్తిలో అంకితభావం, క్రమశిక్షణ, చిత్తశుద్ధితో మెలిగేవారన్నారు. ఆయన సేవలకు మెచ్చి జిల్లా అధికారులు ప్రశంసాపత్రం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రముఖ పాత్రికేయుడు సుంకర చలపతిరావు, రచయిత కె.సత్తిరాజు, కార్మిక నాయకుడు సత్యానందం, జాతీయ సేవా జిల్లా ప్రోగ్రాం అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి తదితరులు అజేయ్‌కుమార్‌ను అభినందించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత, గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ మాట్లాడుతూ అవార్డులు బాధ్యతను మరింత పెంచుతాయని తెలిపారు.


గ్రంథాలయాధికారి అజేయ్‌ను సత్కరిస్తున్న అతిథులు

నిరుపేదలకు చీరల పంపిణీ

మల్కాపురం : 59వ వార్డు పరిధి పలువురు నిరుపేదలకు బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు చీరలు పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా గాజువాక నందమూరి ఫ్యాన్స్ అధ్యక్షుడు నమ్మి గౌరీశ్వరరావుయాదవ్ ఆధ్వర్యంలో 59వ వార్డు గాజువాక డిపో వద్ద గోకుల యాదవ సామాజిక భవనం వద్ద శనివారం ఈ కార్యక్రమం జరిగింది. గాజువాక కార్పొరేటర్ పల్లా శ్రీనుయాదవ్, 59వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్ అతిథులుగా హాజరై మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా నందమూరి అభిమానులు ఇలాంటి సేవా కార్యక్రమం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక ఆర్టీసీ డిపో యూనియన్ నాయకుడు శంకరరావు, నందమూరి ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న సురేష్‌యాదవ్, శ్రీనుయాదవ్, గౌరీశ్వరరావుయాదవ్

సంస్కారవంతులను తీర్చిదిద్దేదే విద్యాలయం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు



ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శన

గోపాలపట్నం: పాఠశాల విద్యార్థులను సంస్కారవంతులుగా తీర్చి దిద్దుతుందని కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కె. రాంబాబు అన్నారు. గోపాలపట్నం బాలాజీ పాఠశాల 42వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధికి పాటుపడేందుకు విద్యను ఉపయోగించాలని ఆకాంక్షించారు. కోవిడ్ సమయంలో మృతి చెందిన ఉపాధ్యాయులకు నివాళులర్పించారు. చిన్నారులు ప్రదర్శించిన పలు నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మాండవ రవికుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

30 నుంచి కుష్టువ్యాధిపై అవగాహన

మహారాణిపేట : జాతిపిత మహాత్మా గాంధీ 75వ వర్ధంతి సందర్భంగా ఈనెల 30 నుంచి వచ్చేనెల 13 వరకు కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా లెప్రసీ అండ్ టీబీ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, పాఠశాల, కాలేజీ విద్యార్థులు పాల్గొని కుష్టువ్యాధి నివారణకు కృషి చేయాలన్నారు. గ్రామ స్థాయిలో ఆశ, అంగన్‌వాడీ, ఏఎన్ఎం, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని తెలిపారు. చర్మంపై ఎర్రని రాగి రంగు స్పర్శ లేని మచ్చలు, శరీరం, ముఖంపై బొడిపెలు, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, చేతి వేళ్లు వంగిపోవడం, కాళ్లు, పాదాలు వాలిపోవడం, కళ్లు మూత పడకపోవడం వంటివి కుష్టువ్యాధి లక్షణాలని తెలిపారు. అలాంటి లక్షణాలు కలిగిన వ్యక్తులు ఆశ లేదా ఆరోగ్య కార్యకర్తను సంప్రదించి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స పొందాలని అన్నారు. ప్రారంభ దశలోనే ఈ వ్యాధిని గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా కాపాడుకోవచ్చన్నారు. అంగవైకల్యం గల వారికి ప్రభుత్వం ఉచితంగా శస్త్ర చికిత్స చేయించి అదనంగా 8 వేల రూపాయిల పారితోషికం అందిస్తుందని డాక్టర్ పూర్ణేంద్రబాబు తెలిపారు. కుష్టువ్యాధిగ్రస్తులు లేదా కుటుంబ సభ్యులకు ఉచితంగా సాంకేతిక విద్యలో శిక్షణ అందజేసి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు.

బంగారుమాంబ పరస నేడు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం గ్రామ దేవత బంగారుమాంబ అమ్మవారి పరస మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించనున్నారు. భక్తులు అమ్మవారికి నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమలు, నైవేద్యం సమర్పించనున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విద్యుత్ దీపాలంకరణ మధ్య అమ్మవారి పరస మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.


నాతయ్యపాలెంలో కొలువైన అమ్మవారు